


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

గురువారం 3-4-2025

సంపుటి: 21 సంచిక: 8
పేజీలు: 8 వెల: రూ.1


## బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా.. **దండి శ్రీనివాస పద్మజా కుమార్ దేవ్** అనే నేను(తండ్రి పేరు దండి వజ్రహస్త దేవ్) దండివీధి, పాత శ్రీకాకుళం అనే చిరునామాలో నివసించుచున్నాను. నాకు అరసవిల్లి గ్రామంలో ఖాతా నెంబరు 590, సర్వే నెం 474-19లో మా పూర్వీకుల నుంచి దఖలు పడిన 18 సెంట్ల భూమి కలదు. ఈ భూమికి సంబంధించిన 1బి మరియు పాస్‌బుక్ కూడా నా పేరు మీదే కలవు. మా తండ్రి గారి తదనంతరం ఈ భూమిని నేను సాగు చేసుకొంటున్నాను. దానికి సంబంధించిన భూమి శిస్తు కూడా నేనే చెల్లించుచున్నాను. కానీ భోగి ఝాన్సీరాణి (భర్త పేరు భోగి శంకరరావు) అనే మహిళ తప్పుడు పత్రాలు సృష్టించి గతంలో మండల రెవెన్యూ ఆఫీసులో చూపించి నా పేరు మీద ఉన్న అడంగల్, 1బి మరియు పాస్ పుస్తకాలను తన పేరు మీద మార్పించుకునేందుకు ప్రయత్నం చేశారు. ఈ విషయంపై నేను గౌరవ న్యాయస్థానమును ఆశ్రయించగా గౌరవ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, శ్రీకాకుళం వారు దీనిపై కేసు IA NO. 158/2019 IN OS 338/2019 ప్రకారం ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చియున్నారు. ప్రస్తుతం ఈ ఇంజక్షన్ ఆర్డర్ అమలులో ఉన్నది. ఇప్పుడు మరల సదరు భోగి ఝాన్సీ రాణి (భర్త పేరు భోగి శంకరరావు) అనే సదరు మహిళ కోర్టు ఇచ్చిన ఇంజక్షన్ ఆర్డర్ అమలులో ఉన్నప్పటికీ తన పలుకుబడి ఉపయోగించి నా పేరు మీద ఉన్న అడంగల్, 1బి మరియు పాస్ పుస్తకాలను తన పేరు మీదకు మార్చుకొనుటకు ప్రయత్నం చేయుచున్నారని తెలిసినది. దీనిపై నేను అని వివరాలు, ఆధారాలతో సహా గౌరవ రెవెన్యూ డివిజనల్ అధికారి(ఆర్డీవో) శ్రీకాకుళం వారికి ఫిర్యాదు కూడా చేశాను. కోర్టులో కేసు, ఆర్డీవో కార్యాలయంలో నా ఫిర్యాదు పెండింగులో ఉన్నందున నాకు తెలియకుండా పైన పేర్కొన్న నాయొక్క భూమికి చెందిన 1బి, అడంగల్, పాస్‌పుస్తకాల్లో ఎలాంటి మార్పులు చేయరాదని కోరుచున్నాను. నాకు తెలియకుండా, నా అనుమతి లేకుండా నా స్థలంపై చేసే ఎటువంటి క్రయ విక్రయాలు చెల్లవు. నా స్థలంలో నాకు అనుమతి లేకుండా చొరబడినా, స్వాధీనానికి ప్రయత్నించినవారు చట్టప్రకారం శిక్షార్హులవుతారని హెచ్చరిస్తున్నాను.

**స్థలం హద్దులు:**

సర్వే నెం. 474/19లోని నా స్థలానికి తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ దిక్కుల్లో డాక్టర్ దానేటి శ్రీధర్‌కు చెందిన ఖాళీ స్థలాలు హద్దులుగా ఉన్నాయి.

ఇట్లు

**దండి శ్రీనివాస పద్మజా కుమార్ దేవ్**

దండివీధి, శ్రీకాకుళం.




పేరుకే వారు పోలీసులు.. కానీ దొంగలు చేసే పనులన్నీ చేస్తుంటారు. అందుకే ఏ విభాగంలో ఉన్నా జిల్లా మొత్తం యూనిఫాంతో తిరుగుతుంటారు. డబ్బు సంపాదనలో రకరకాల మార్గాలుంటాయి. కొంతమంది ఉద్యోగాలు చేసి, మరికొంతమంది వ్యాపారాలు చేసి సంపాదిస్తారు. కానీ వీరిద్దరు ఉద్యోగంతో పాటు వేరే దందాలు చేసి కూడా సంపాదిస్తున్నారు. దొంగలు దోపిడీ చేసి, రాజకీయ నాయకులు అవినీతి చేసి సంపాదిస్తారు. చెప్పకుంటూపోతే ఇంకా చాలామార్గాలున్నాయి. ఎవరి మార్గం వారిది. అందరి లక్ష్యం ఒకటే. అయితే పోలీసు యూనిఫాం వేసుకున్నవారికి మాత్రం అవినీతిపరుల, దొంగల ఆట కట్టించడమే ధ్యేయం కావాలి. కానీ దొంగలకే దొంగలా వ్యవహరిస్తే.. ఆ పోలీసుల కోసం ఎవరికి చెప్పకోవాలి. జిల్లాకు ఎస్పీగా మహేశ్వర్‌రెడ్డి వచ్చిన తర్వాత ఎవర్నీ క్షమించడంలేదని తెలిసి కూడా యూనిఫాం ముసుగులో దోపిడీకి తెరతీస్తే శిక్ష లేదనుకుంటున్నారో ఏమో?! వివరాల్లోకి వెళితే..

# అమ్మ దొంగ పోలీసులూ..!


గ్రామానికి డబ్బులు తీసుకువచ్చి పంచిన కృష్ణ

- డీఎస్పీ కార్యాలయం పేరు చెప్పి రూ.30 లక్షలు నొక్కేసిన కానిస్టేబుళ్లు
- దొంగనోట్ల చెలామణీ సొమ్మే పంచుకున్నారని ఆరోపణలు
- సంబంధం లేని విభాగం నుంచి రాయిపాడు ఎందుకు వెళ్లినట్టు?
- డీఎస్పీ కార్యాలయం పేరు వాడకంపై ఆరా తీస్తున్న ఇంటెలిజెన్స్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం రూరల్ మండలం రాయిపాడు గ్రామానికి చెందిన బుడ్డీ ఎక్కడి నుంచో దాదాపు రూ.50 లక్షల వరకు నగదు తీసుకువచ్చారు. ఎలా తెచ్చాడు, ఎలా సంపాదించాడు? అనేది తేలకపోయినా గ్రామంలో అందరికీ విచ్చలవిడిగా డబ్బులు పంచుతున్నాడని తెలుసుకున్న ఇద్దరు పోలీసులు తమకు అన్ని విషయాలూ తెలుసని, మర్యాదగా డబ్బులివ్వకపోతే కేసు నమోదు చేస్తామని, తాము శ్రీకాకుళం డీఎస్పీ ఆఫీసు నుంచి వచ్చామంటూ భయపెట్టి, ఆ సొమ్ములు గుంజుకున్న ఉదంతం ప్రస్తుతం జిల్లా కేంద్రంలో హాట్‌టాపిక్‌గా మారింది. ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సూరిబాబు, శ్రీకాకుళం రూరల్ స్టేషన్‌లో క్రైం కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గోపాల్ కలిసి రాయిపాడులో అముజూరి కృష్ణ ఉరఫ్ బుడ్డి ఎవరికైతే కొద్ది రోజులుగా విచ్చలవిడిగా డబ్బు పంచాడో వారందరి ఇళ్లకు వెళ్లి భయపెట్టి మరీ ఆ సొమ్ము గుంజుకున్నారట. ఇది జరిగి రోజులు గడిచినా ఇంతవరకు దీనిపై ఎటువంటి కేసూ నమోదు కాకపోవడంతో తమ వద్దకు వచ్చింది నకిలీ పోలీసులేమోనని రాయిపాడులో బుడ్డీనుంచి డబ్బులు తీసుకున్నవారు భావించారు. కానీ ఆ తర్వాత కూడా బుడ్డీ దగ్గర మిగిలిన సొమ్మును, రాయిపాడులో మరికొందర్ని వెతికి పట్టుకొని మరీ మొత్తం సొమ్ము వసూలు చేసేయడంతో ఇది పోలీసుల దొంగపనేనని, నిజంగా ఈ సొమ్మును లెక్కల్లో చూపిస్తే కచ్చితంగా కేసు కట్టి తమ వద్ద వివరాలను తీసుకునేవారని, ఇంతవరకు అటువంటిది జరగకపోవడంతో తమ వద్ద సొమ్ములు కొట్టేశారని చెబుతున్నారు. ఇదిలా ఉండగా, రాయిపాడుకు చెందిన బుడ్డీ తాను నకిలీ నోట్లు మార్చడం ద్వారా - మిగతా చివరి పేజీలో


డబ్బులు వసూలు కోసం ఒక ఇంటిలో తిష్ట వేసిన కానిస్టేబుళ్లు



• ఎడిటోరియల్

# 4-పి కేంద్రీకరణా? వికేంద్రీకరణా!

పేదరికం లేకుండా చేయడానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉగాది నాడు ప్రకటించిన పబ్లిక్ (గవర్నమెంటు) ప్రైవేట్ (ఇన్వెస్టర్స్) పీపుల్ (ప్రజలు) పార్టిసిపేషన్ – కాన్సెప్ట్‌లో అస్పష్టత వుంది. ఈ '4పి' పథకానికి ఆగస్టు 15 కల్లా తుదిరూపం ఇస్తామన్నారు. ఈ లోగానే ఈ పథకంపై ఆర్థిక, సాంఘిక వేదికల మీద చర్చ జరగవలసిన అవసరం వుంది. వనరుల ఆధారంగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ఎక్కడికక్కడ ప్రోత్సహించే వికేంద్రీకరణ విధానాలు అమలైతేనే '4పి' సఫలం కావచ్చు! పేదలకు సహాయం చేయడం, అవసరానికి ఆదుకోవడం మన సంఘంలోనే వుంది. రంజాన్ ప్రార్థనలకు ముందు ముస్లింలు పేదలకు 'ఫిత్రా' (దానధర్మాలు) చేస్తారు. క్రైస్తవులు తమ ఆదాయాల నుంచి కొంత సొమ్ము చర్చికి ఇస్తారు. హిందువులు ప్రతీ వైదిక క్రతువులో దానధర్మాలు దక్షిణలు ఇస్తారు. వ్యాపారస్తులు యాచకులకు రోజూ కొంత డబ్బు ఇస్తారు. ఇవన్నీ పేదలకు సాయపడేవే. మనుషుల అభిరుచి, శ్రమ నుంచి ఆయా రంగాలు వికసిస్తాయి. సంపదలు జమకూడుతాయి. పరస్పర ఆధారిత సమాజంలో ఆర్థిక వనరులు పంపిణీ తీరునిబట్టే ఆర్థిక అసమానతలు తగ్గుతాయి. పేదల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. గ్రామ స్వరాజ్యమే ఇందుకు పరిష్కారమని గాంధీజీ ఎప్పుడో సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో గ్రామాలు యూనిట్‌గా వికేంద్రీకరణ విధానాలు అమలయ్యేవి. 1972లో ప్రత్యేకాంధ్ర ఉద్యమం విఫలమయ్యాక హైదరాబాద్‌కు వలసలు మొదలయ్యాయి. కోస్తా రాయలసీమ ప్రాంతాల క్రీమ్ అంతా రాజధాని చేరుకుంది. అక్కడే డబ్బు తిరిగింది. అక్కడే సంపదలు పోగుపడ్డాయి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విప్లవమై ప్రపంచాన్ని చుట్టేస్తున్నపుడు చంద్రబాబు హైదరాబాద్ మీదే దృష్టిపెట్టారు. ఈ కేంద్రీకృత విధానంవల్ల హైదరాబాద్‌కు ప్రపంచంలో ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది. అక్కడ సంపదలు పెరిగి లక్షల మందికి ఉపాధి కేంద్రమైంది. అయితే మరో నగరం వృద్ధి కాకపోవడం వల్ల రాష్ట్ర విభజన నాటికి ఆంధ్రప్రదేశ్ నెత్తిమీద గొడుగులేని రాష్ట్రమైపోయింది. అమరావతిలో కూడా చంద్రబాబు కేంద్రీకృత ఆర్థిక విధానాన్నే అవలంభిస్తున్నట్టు అర్థమౌతోంది. అక్కడ పబ్లిక్ ప్రైవేట్ పార్టిసిపేషన్ (3పి) విధానం వుంది. విదేశీ సంస్థలు లేదా అత్యంత సంపన్నమైన కంపెనీలు మాత్రమే అక్కడ పెట్టుబడులు పెట్టగలుగుతాయి. ఇందులో సంపదల పంపిణీ పేదరికాన్ని తొలగించడానికి నేరుగా ఉపయోగపడదు. ఎక్కడికి అక్కడ ఆర్థిక వనరుల పంపిణీ జరగాలంటే వికేంద్రీకరణ తప్ప మరో మార్గం లేదు. వైద్య ఆరోగ్యరంగాన్నే ఉదాహరణగా తీసుకుందాం.. చంద్రబాబు విధానాల వల్ల ఇప్పటి ఆంధ్రప్రదేశ్‌లో 20 వరకూ ప్రైవేట్ మెడికల్ కాలేజీలు వచ్చాయి. వాటి యాజమాన్యాలన్నీ స్థానికంగా వున్నవే. వీటిలో కార్పొరేట్ యాజమాన్యాలు లేవు. ఆదాయ వ్యయాలు అక్కడక్కడే తిరుగుతూ వుంటాయి. సర్వీసులు, సప్లైల ద్వారా వందల మందికి పని డబ్బు దొరుకుతోంది. వేల వేల మంది పేషెంట్లకు ప్రైవేట్ హాస్పిటల్స్ కంటే 50 నుంచి 60 శాతం తక్కువ ఖర్చుకే వైద్య చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. వైద్యం ఖర్చులకు ప్రజల ఆదాయాలకు పొంతన కుదరక జబ్బు పడినవారు మధ్యతరగతి వారైతే పేదలుగా అప్పుల్లోకి, పేదలైతే నిస్సహాయమైన దరిద్రంలోకి కూరుకుపోతున్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం వల్ల టీచింగ్ హాస్పిటల్స్‌లో పేషెంట్ల ఖర్చు 80 నుంచి 90 శాతం తగ్గిపోయింది. ఈ మిగుళ్ల ప్రయోజనం స్థానికులకే దక్కుతోందంటే అది వికేంద్రీకరణ ఫలితమే. ప్రతీ ప్రభుత్వమూ ఆరోగ్యశ్రీ బకాయిలు ఇవ్వకుండా హాస్పిటల్స్‌ను అప్పుల వడ్డీల భారాల్లోకి నెట్టేస్తూనే వుంది. ఇందులో జగన్‌కి, చంద్రబాబుకి ఏ మాత్రం తేడాలేదు. పేదల సంక్షేమానికి వేలకోట్లు ఖర్చు చేస్తున్న చంద్రబాబు ప్రభుత్వానికి కూడా అనారోగ్యాలే ప్రజల్ని దరిద్రంలోకి నెట్టేస్తున్నాయన్న స్పృహ లేకపోవడం ఆశ్చర్యకరం. వైఎస్ ముద్ర వున్న ఆరోగ్యశ్రీకి చంద్రబాబు ఏదైనా ప్రత్యామ్నాయాన్ని ఆలోచిస్తున్నారేమో తెలియదు. 4పి పథకం కోసం దాతల్ని వెతకడం ఒక పనిగా మారిపోకూడదు. అది ఒక సహజవిధానంగానే సాగిపోవాలి. ఇందుకు స్థానికులను భాగస్వాములు చేసే వికేంద్రీకరణ విధానమే పరిష్కారం. చిన్న మధ్యతరహా పరిశ్రమలను, సర్వీసులను ప్రోత్సహించే విధానాలను ప్రభుత్వం అమలుచేస్తే దాతల కోసం వెతికే పని వుండదు!

## ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో, ప్రజల సురక్షితమైన జీవితాలు గడపడంలో పోలీసులు పాత్ర కీలకమైనదని పోలీసులు సామాజిక సేవకులని ట్రాఫిక్ సీఐ వి నాగ రాజు అన్నారు. నగరంలోని పలు ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీసులకు నగరంలోని నానుబాలవీధిలో వెలసిన విజయదుర్గ ఆలయ అర్చకుల ఆరవెల్లి సూర్యనారాయణశర్మ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ గురువారం చేశారు. ఈ సందర్భంగా సీఐ నాగ రాజు మాట్లాడుతూ సుమారు 40 డిగ్రీల ఉష్ణోగ్రతలోనూ ట్రాఫిక్ పోలీసులు రోడ్లపై నిలబడి విధులు నిర్వహిస్తున్నారన్నారు. వారి ఆరోగ్యం దృష్ట్యా దాతలు స్పందించి ముందుకు రావడం ఆనందంగా ఉందని తెలిపారు. ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించాలని, ఎండ తీవ్రత వల్ల వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రజలకు అత్యవసరమైతే తప్ప ఉదయం 11 తరువాత మూడు గంటల వరకు బయటకు రావద్దని తెలిపారు. కార్యక్రమంలో విజయదుర్గ ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణశర్మ, కస్తూరి సంతోష్, కాంబాబు, రాజశేఖర్, రాజేష్, రాజు, నారాయణశెట్టి గుప్త, ట్రాఫిక్ సిబ్బంది హెచ్ పున్నయ్య, ప్రకాష్, దుర్గారావు, ఈశ్వరరావు, శ్రీను, సాయి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## ఒంటిపూట బడులు శతశాతం అమలు జరపాల్సిందే

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


రాష్ట్రంలో అత్యధికంగా వేసవి ఉష్ణోగ్రతలు నమోదవుతున్న దృష్ట్యా అన్ని పాఠశాలల యాజమాన్యాలు శతశాతం ఒంటిపూట బడులు పక్కాగా అమలు జరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలని, ఇప్పటికే తమ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, విద్యాశాఖాధికారులతోపాటు జిల్లా ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు తమ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో జారీచేసినట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం చెప్పారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇదే అంశంపై ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ కూడా ఉత్తర్వులు జారీచేసిందని గుర్తు చేశారు. ఇప్పటికీ రాష్ట్రంలో వివిధ పాఠశాలల్లో ఈ ఉత్తర్వులు పాటించకుండా తొమ్మిది, పదో తరగతులకు ప్రత్యేక తరగతులు పేరిట రెండుపూటలు, అలాగే సాయంత్రం నాలుగు గంటలనుండి ఎనిమిది గంటల వరకు పరోక్షంగా తరగతులు నిర్వహిస్తున్నట్లు తమ కమిషన్‌కు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వివిధ ఫిర్యాదులు అందజేస్తున్నారని చెప్పారు. ఈ తరగతుల నిర్వహణపై రాష్ట్రంలో ఎవరికీ ఎటువంటి మినహాయింపులు ఉండబోవని, ఒంటిపూట బడులు అమలు జరపాల్సిందేనన్నారు. తమ కమిషన్ ఆదేశాలు, ప్రభుత్వ ఉత్తర్వులు పాటించని పాఠశాలల యాజమాన్యాలపై డేగకళ్ళతో పర్యవేక్షణ జరపడంతో పాటు ఆయా స్కూళ్లు గుర్తింపు రద్దు, క్రిమినల్ చర్యలకు వివిధ సిఫారసులు చేయనున్నట్టు తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు apscpcr2018@gmail.com నేరుగా ఫిర్యాదులు అందించాలని సీతారాం తెలిపారు.

## విజిలెన్సు కమిటీ జిల్లా సభ్యులుగా రౌతు సూర్యనారాయణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



సివిల్ సప్లై జాతీయ ఆహార భద్రతా చట్టం 2013లో భాగంగా జిల్లా, మండల ఎమ్‌పీ షాప్ లెవల్ విజిలెన్సు కమిటీసభ్యులుగా ఎండియూ ఆపరేటర్ల అసోయేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రౌతు సూర్యనారాయణను నియమిస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉత్వర్వులు జారీ చేశారు. విజిలెన్స్ సభ్యులుగా నియమించిన వ్యక్తులు పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తారన్నారు. సివిల్ సప్లై పరిధిలో డిపోల్లో, రేషన్ వెహికల్స్‌లో ఎలాంటి అవకతవకలు జరగకుండా విజిలెన్సు కమిటి పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా రౌతు సూర్యనారాయణ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా విజిలెన్సు కమిటీసభ్యులుగా రెండవసారి నియమించడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇచ్చిన బాధ్యతను శక్తివంచన లేకుండా నెరవేర్చుతానని సూర్యనారాయణ పేర్కొన్నారు. కమిటీసభ్యులతో కలిసి పనిచేస్తానని తెలిపారు.



ప్రత్యక్షదైవం అరసవల్లి సూర్యనారాయణస్వామి శాశ్వత అన్నదాన పథకానికి బచ్చు వరలక్ష్మి రూ.లక్ష వితరణ చేశారు. ఈమేరకు గురువారం ఆలయంలోని ఆలయ సీనియర్ సహాయకులు ఎ.శోభనాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులకు అందజేశారు. అనంతరం వారికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి వారి జ్ఞాపికను ఆలయ కార్యనిర్వహణాధికారి వై.భద్రాజీ అందజేశారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## సీహెచ్‌సీలో ఆటిజం డే

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని ప్రభుత్వ సామజిక ఆసుపత్రిలోని జిల్లా బాలభవిత కేంద్రంలో గురువారం ప్రపంచ ఆటిజం డే కార్యక్రమాన్ని జిల్లా ప్రోగ్రాము అధికారి డాక్టర్ వెంకటరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి క్లినికల్ సైకాలజిస్ట్ ఆర్.రాజకుమార్ మాట్లాడుతూ సాధారణ శిశువు 3 నెలలు వచ్చినప్పటి నుంచే తల్లిని గుర్తుపడతారన్నారు. చూపుతో చూపు కలుపుతారని, కళ్లలో కళ్లు పెట్టి నవ్వితే నవ్వుతారన్నారు. అయితే 'ఆటిజం' పిల్లల్లో చూపు మామూలుగానే ఉంటుంది కానీ తల్లిదండ్రులను గుర్తుపట్టలేరన్నారు. వినికిడి సాధారణంగానే ఉంటుంది. కానీ పేరు పెట్టి పిలిస్తే మన వైపు చూడరని, 'ఆటిజం'లో ఇదొక ప్రధాన లక్షణమని స్పష్టం చేశారు. భారత్‌లో దాదాపు 2శాతం పిల్లలు ఈ రకమైన జబ్బుతో బాధపడుతున్నారన్నారు. ఆటిజానికి కచ్చితమైన చికిత్స అంటూ ఏమీ లేదని, అయితే ప్రతి ఒక్కరికి వారి లక్షణాలను బట్టి ఆక్యుపేషనల్ థెరపీ, స్పీచ్ థెరపీ, బిహేవియర్ థెరపీ.. ఈ రకంగా చికిత్సలు జిల్లా బాల భవిత కేంద్రాలు శ్రీకాకుళం, టెక్కలిలో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పీడియాట్రిషన్ డాక్టర్ నూక చైతన్య, ఫిజియోథెరపిస్ట్ సత్యవతి, డెంటల్ డాక్టర్ కుసుమలత, ఆడియో టెక్నీషియన్, స్పీచ్ థెరపిస్ట్ అఖిల, సిబ్బంది, పిల్లలు, వారి తల్లి తండ్రులు పాల్గొన్నారు.






# స్టార్ హీరో జీవితాన్ని ఓ రైతు మార్చాడు!

మాధవన్ అంటే తెలియందెవరికి? సఖి, చెలి అంటూ కుర్రకారును వెర్రెక్కించిన లవర్ బాయ్‌గా.. త్రీఈడియట్స్ లో ఓ ఈడియట్ గా ఇలా దక్షిణ, ఉత్తరాదిలో పలు సినిమాలతో పరిచయమైన సుపరిచితుడు. మణిరత్నం స్కూల్ నుంచి వచ్చి సినిమానే ప్రేమిస్తున్న మాధవన్ జీవితాన్ని ఓ రైతు అమాంతం మార్చేశాడు. ఆ కథ మాధవన్ ఓ నేషనల్ ఛానల్ కు చెప్పాడు. ఏంటా ఇంట్రెస్టింగ్ కథ.. ఇంతకీ ఆ రైతు ఏం చేశాడు.. మాధవన్ లో ఉన్నపళంగా అంత మార్పెలా సాధ్యమైంది? జీవితంలో చోటుచేసుకునే అనుభవాలే మన దారిని నిర్దేశిస్తుంటాయి. ఒక దారిలో ఉన్నాడనుకున్న వ్యక్తిలో ఒక అమూర్తభావన ఊహించని కొత్త దారిలోకి మళ్లించవచ్చు. అదే మాధవన్‌ను దారి మళ్లించింది. అందుకే, మాధవన్ గత నాల్గేళ్ల నుంచీ సినిమాలకే దూరమయ్యాడు.

ఓనాడు స్విట్జర్లాండ్‌లో మాధవన్ తమిళ సినిమా షూటింగ్‌లో పాల్గొన్నాడు. నారింజ రంగు ప్యాంట్, ఆకు పచ్చ చొక్కా ధరించి రోడ్డు మధ్యలో పాటకు అనుగుణంగా డ్యాన్స్ చేస్తున్నాడు. ఆ సందర్భం కూడా పాట చిత్రీకరణ కోసమే వేసిన సెట్టే. ఆ సమయంలో మాధవన్ పక్కనుంచే ఓ స్విస్ రైతు అటుగా వెళ్తుతూ.. ఏదో తనకు నచ్చనట్టుగా తల ఊపుతూ వెళ్లిపోతున్నాడు. అది కాస్తా మాధవన్‌ను డిస్టర్బ్ చేసింది. ఏయ్ ఆగు.. నేనెవరో నీకు తెలుసా.. ఓసారి చెన్నై రా.. నేనంటే ఏంటో తెలుస్తుందంటూ ఆ రైతుతో కాస్తా దబాయిస్తున్నట్టుగా మాట్లాడాడు. అతనికేమర్థమైందో, ఆ తర్వాతేమైందో తెలియదుగానీ.. ఆ రైతు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కానీ, ఆ ఘటన మాధవన్‌లో ఏదో విచారాన్ని రేకెత్తించింది. ఆ విచారం కాస్తా.. తానెవరో తయారు చేసిన బాణీలకు నృత్యం చేస్తున్నాననే భావనను కల్పించింది. అంటే, ఎవరో ఆడించినట్టు ఆడే బతుకా నాది అనే ఒక ఆలోచనతో కూడిన బలమైన అభిప్రాయం మనసులో నాటుకుపోయింది.

### కొంతకాలం సినిమాల నుండి తప్పుకోవాలనే నిర్ణయం!

ఆ రైతు ఎందుకలా తల ఊపుతూ వెళ్లిపోయాడు.. ఏమనుకుని ఉంటాడన్న మథనం నుంచి మొదలైన ఆలోచనలు మాధవన్‌లో సుడులు సుడులుగా తిరగడం మొదలయ్యాయి. తన జీవితం అర్థవంతంగా సాగడం కంటే కూడా.. ఇతరులు ఆశించేదాని ఆధారంగా మాత్రమే నడుస్తుందా.. అదే తన కెరీర్‌గా మారిపోయిందా అనే భావనలు చుట్టుముట్టాయి. దాంతో ఆ భావనతో ఒక గట్టి నిర్ణయం తీసుకున్నాడు. సినిమాలే కాకుండా, వాణిజ్య ప్రకటనల నుంచీ కొంతకాలం దూరముండాలని ప్రతినబూనాడు.


అదే సమయంలో తన మనసులో మాటల్ని భార్యతోనూ షేర్ చేసుకున్నాడట మాధవన్. ఓ ఫైన్ మార్నింగ్.. నువ్వు ఏదైతే చేస్తున్నావో.. దాన్నుంచి అంతకన్నా ఎక్కువే తిరిగి రావాలని కోరుకుంటున్నావ్.. అందుకు తగ్గట్టుగానే పని చేస్తున్నావందట మాధవన్ భార్య. భార్య మాటల తర్వాత ఇక విరామం తీసుకోవాల్సిందేనని గట్టి పట్టుబట్టిన మాధవన్.. ప్రపంచాన్ని కాస్త చదవాలని నిర్ణయించుకున్నాడు. ప్రజలు ఏం కోరుకుంటున్నారు.. వేటిని అభినందిస్తున్నారు.. అసలీ దేశం, ప్రపంచం అనుసరిస్తున్న మార్గాలేంటి.. ఇలాంటి విషయాలన్నీ తెలుసుకోవాలనుకుని దేశదిమ్మరి అవతారమెత్తాడు మాధవన్. మొత్తంగా ఒక వైరాగ్య భావన కూడా అమూర్తంగా మెదట్లోకెక్కిన మాధవన్ ఫిజికల్ గా కూడా నెరిసిన తెల్లటి గడ్డంతో.. ఒక సూపర్ స్టార్ కు పూర్తి భిన్నంగా మారిపోయాడు. అలాగే, భారతదేశంలోని వివిధ ప్రాంతాలనూ పర్యటించాడు. ఒక రిక్షాపుల్లర్ ఏం చర్చిస్తున్నాడు.. ఒక కుండలమ్ముకునే వ్యక్తి ఆలోచనలెలా సాగుతున్నాయి.. ఇలా భిన్నరకాల వారిని కలిసి మాట్లాడుతూ ఓ బహుదూరపు బాటసారి అవతారమెత్తాడు హీరో మాధవన్.

ఎందరో దర్శకులతో పనిచేసినవాడు. మణిరత్నం, రాజూహిరానీ వంటివారితో పనిచేసిన అనుభవజ్ఞుడైన నటుడు. తానే స్వయంగా నంబి నారాయణన్ సినిమా కథను రాసుకుని రాకెట్రీ పేరుతో దర్శకత్వం వహించి వార్తల్లోకెక్కినవాడు, చాలాకాలం కుర్రకారుకు యూత్ అంటే ఇలా ఉంటుందనే విభ్రమకు గురిచేసినవాడు.. కానీ, ఓ రైతు అదోరకంగా చూసిన చూపులతో పూర్తిగా తీవ్రమైన ఆలోచనలో పడిపోయాడు. ఏకంగా దాదాపుగా నాల్గేళ్లుగా సినిమాలు, వాణిజ్య ప్రకటనలన్నీ వదిలేసి దేశదిమ్మరి అవతారమెత్తాడు. మరి ఇప్పుడు ఆత్మపరిశీలన తర్వాత మాధవన్ నటించే పాత్రలు, ఆయన నటనలో మార్పులెలా ఉంటాయన్నది ఆసక్తికరం.

- బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...

### ఆత్మపరిశీలనకు దోహదపడిన ప్రయాణం!

మాధవన్ నిర్ణయం మామూలుదేం కాదు. చేతిలో సినిమాలు, హీరోగా, వెర్సటైల్ నటుడిగా తనకున్న ఇమేజ్ ఇవన్నీ కాదనుకుని పరిశ్రమ నుంచి విరామం తీసుకోవడమంటే అంత సంకల్పబలముండాల్సిందే. అలా వివిధ ప్రాంతాలను సందర్శిస్తూ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గమనిస్తూ, నిశితంగా పరిశీలిస్తూ, వారేం కోరుకుంటున్నారో తెలుసుకుంటూ.. ఆ అనుభవాలను నటనలో తన విధానాన్ని తిరిగి రూపొందించుకోవడంలోనూ, ఎలాంటి పాత్రలు పోషించాలో తెలుసుకోవడంలోనూ మరింత స్పహకు కారణమైందంటాడు. తన ప్రయాణం మాధవన్‌కు కొత్త నట జీవితాన్నిస్తుందన్న నమ్మకంతో ఉన్నానంటున్నాడు. తిరిగి ప్రేక్షకులతో కనెక్టయ్యేందుకు మరింత సాయపడుతుందన్న మెండైన విశ్వాసంతో ఉన్న మాధవన్.. సిద్ధార్థ్, నయనతార ప్రధాన పాత్రధారులుగా నటించిన టెస్ట్ అనే చిత్రంలో నటించాడు. ఇది నెట్ ఫ్లిక్స్ లో విడుదల కానుంది. అలాగే, అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రలో నటించిన కేసరి: చాప్టర్ 2లోనూ కనిపించనున్నాడు. అజయ్ దేవగన్, రకుల్ ప్రీత్ సింగ్ తో కలిసి దేదే ప్యార్ దే సినిమా కోసం కూడా సంతకం చేశాడు.



## ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా భాగ్యలక్ష్మి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో గొద్దు భాగ్యలక్ష్మి ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా నియమితులయ్యారు. ఈమె నియామకం పట్ల జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు తంగి శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి పిట్ట దామోదర, ఇతర కార్యవర్గ సభ్యులు, జూనియర్ సీనియర్ న్యాయవాదులు మహిళా న్యాయవాదులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు అందరు శుభాకాంక్షలు తెలియజేశారు.

## సెంట్రల్ గవర్నమెంట్ పెన్షనర్స్ నిరసన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా సెంట్రల్ గవర్నమెంట్ పెన్షనర్ అసోసియేషన్, నేషనల్ కో–ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్స్‌లు కలిసి గురువారం సెంట్రల్ గవర్నమెంట్ పెన్షనర్స్ హక్కులను హరించే సి.సి.ఎస్. పెన్షన్ రూల్స్ సవరణ బిల్లులి పై నిరసన నిర్వహించారు. ఈ కార్యక్రమంను జిల్లా హెడ్ పోస్టల్ఆఫీసు ఎదురుగా చేపట్టారు. ఈ కార్యక్రమంనకు 100కు పైగా సెంట్రల్ గవర్నమెంట్ పెన్షనర్లు హాజరై జయప్రదం చేసినట్లు కన్వీనర్ కంబాల చంద్రశేఖర్ తెలిపారు. సెంట్రల్ గవర్నమెంట్ తీసుకుంటున్న ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకపోతే ఈ నిరసనను ప్రజల్లోకి తీసుకుని వెళ్లి మరింత ఉధృతం చేస్తామని మీడియాకి తెలిపారు. నిరసన అనంతరం హెడ్ పోస్ట్ ఆఫీస్ పోస్ట్ మాస్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిని ప్రధానమంత్రికి పంపవల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ముఖ్యంగా పోస్టల్, ఆర్.ఎం.ఎస్., నుండి ప్రెసిడెంట్ కె.వెంకటరావు, సెక్రటరీ కె.చంద్రశేఖర్, రైల్వే నుండి ప్రెసిడెంటు డి.జోగారావు, సెక్రటరీ ఎస్.రమేష్, కోశాధికారి కె.సూరయ్య, ఏపీ పెన్షనర్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్ఐసీ ఎం.ఆదినారాయణమూర్తి, కేంద్రీయ విద్యాలయ రిటైర్డు జి.భాస్కరరావు, బి.ఎస్.ఎన్.ఎల్ నుండి గోవర్ధన్, డిఫెన్స్ నుండి ప్రెసిడెంటు పూర్ణ చంద్రరావు కటకం, సెక్రటరీ పి.మురళీధర్ రావు, పారా మిలటరీ పెన్షనర్‌ల నుంచి ప్రెసిడెంటు కిల్లి వెంకటరమణమూర్తి, సీహెచ్ రామారావు, కొంతమంది రాష్ట్ర నాయకులు వచ్చి మద్దతు పలికారు. జిల్లా నలుమూలల నుంచి పెన్షనర్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ఉచిత యోగా శిక్షణా తరగతులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వికాస శిబిరం ఉచిత యోగా శిక్షణ తరగతులు వికాసి తరంగిణి ఆధ్వర్యంలో యోగ గురువు బుస్కి మాస్టర్ ఆధ్వర్యంలో 10రోజులు నిర్వహించారు. ఆఖరిరోజు సందర్భంగా శిక్షణలో పాల్గొన్న సభ్యులు వారి వారి అభిప్రాయాలను తెలిపారు. శరీరానికే కాదు మనసుకి వ్యాయామం అవసరమన్నారు. ఆహారపు అలవాట్లు ఎలా ఉండాలన్న విషయమై వివరించారు. కలుషితమైన వాతావరణంలో యోగ సాధన తప్పనిసరి అని మొదలగు అంశాలు తమకు బాగా నచ్చాయని వివరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులందరికీ ఉచితముగా గుడ్డసంచులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గడే అప్పల నాయుడు, పెంకి చైతన్యకుమార్, మన్మధరావు, పాండూరు వేణుగోపాలరావు, చప్ప నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## ఓవీపేటలో కొలువుల జాతర



(సత్యంన్యూస్, బూర్జ)

మండలంలోని ఓవీపేటలో ఒకే ఇంట్లో ఇద్దరికి వివిధ విభాగాల్లో ఉద్యోగాలు లభించాయి. గ్రామానికి చెందిన నక్క రమణమూర్తి, కుమారి దంపతుల కుమార్తె జోష్నకు తెలంగాణా గ్రామీణబ్యాంక్‌లో క్లర్క్‌గా ఉద్యోగం వచ్చింది. అదే విధంగా కుమారుడు నక్క తరుణ్‌బాబుకు కూడా తెలంగాణా గ్రామీణబ్యాంక్‌లో క్లర్క్‌గా ఉద్యోగం వచ్చింది. వీరిలో జోష్న జెన్‌టీయూ విజయనగరంలో బిటెక్ చేయగా నక్క తరుణ్‌బాబు నాగార్జున యూనివర్సిటీలో బిటెక్ చదివారు. వీరి తండ్రి రమణమూర్తి తెలుగుపండిట్‌గా పని చేయగా, తల్లి ఓవీపేట మాజీ సర్పంచ్‌గా ఉన్నారు. ఒకే ఇంట్లో ఇద్దరికీ ఒకేసారి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## నిరుపేదలకు అండగా నిలిచేది సీఎం రిలీఫ్ ఫండ్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నిరుపేద కుటుంబాలకు, ఆసరాగా నిలిచేది ముఖ్యమంత్రి సహాయనిదని వీటి ద్వారా ఎన్నో కుటుంబాలు సహాయం పొందుతున్నాయని శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గార మండలం రామచంద్రపురంకి చెందిన గొలివి ప్రతాప్‌కు వైద్యం నిమిత్తం రూ.10 లక్షలు ముఖ్యమంత్రి సహాయం నిధి నుండి వచ్చిన ఎల్ఓసీ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి కటుంబాలకు, ఆర్థికంగా సహాయ పడేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని, గతంలో వైద్యం అందక ఎన్నో ప్రాణాలు పోయాయని, అటువంటి పరిస్థితి నేడు లేదని, తెలిపారు. ఈ సహాయం ద్వారా ఎన్నో జీవితాలు నిలబెడుతున్నాయని ప్రజల సంరక్షణ ధ్యేయంగా ముఖ్యమంత్రి సహాయనిధి పనిచేస్తుందని, తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.



# నైరాశ్యం వీడండి - నైపుణ్యం పెంచుకోండి

## హర్షవల్లి లయన్స్ క్లబ్ శ్రీకాకుళం నిర్వహించిన యువ సదస్సులో వక్తల పిలుపు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యువత నైరాశ్యం వీడి, వివిధ వృత్తులలో నైపుణ్యాన్ని పెంచుకొని అదాయాభివృద్ధి చేసుకొని ఆదర్శంగా నిలవాలని డి.చంద్ర మౌళి అదనపు ఎగ్జిక్యూటివ్ ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాల అభివృద్ధి సంస్థ శ్రీకాకుళం అన్నారు. హర్షవల్లి లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం వారి ఆధ్వర్యంలో చైతన్య సహకార కళాశాలలో గురువారం "యువత మరియు ఉపాధి కల్పన" అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సుకు కీలక ఉపన్యాసకర్తగా విచ్చేసిన డి.చంద్రమౌళి మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక అవకాశాల్ని కల్పిస్తుందని, శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని అన్నారు. ఇందుకోసం జిల్లాలో 30 శిక్షణా కేంద్రాలు అలాగే నేషనల్ అకాడమీ ఫర్ కన్స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో నిర్మాణ రంగంలో శిక్షణ కార్యక్రమాలు ఉచితంగా ప్రభుత్వము ద్వారా ఇస్తుందన్నారు. ప్రతి నియోజకవర్గ పరిధిలోను జాబ్‌మేళాలను నిర్వహించి యువతకు అక్కడికక్కడే ఉద్యోగ నియామక పత్రాలను అందజేస్తామన్నారు. డాక్టర్ జామి భీమశంకర్ మాట్లాడుతూ యువత ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడం ద్వారా మాత్రమే విజయాన్ని సాధించగలరని అదే వారికి విజయ సోఫానమన్నారు. తమ కళాశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం తమ అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. లయన్ వావిలపల్లి జగన్నాథ నాయుడు, అధ్యక్షుడు హర్షవల్లి లయన్స్ క్లబ్ లయన్ హారిక ప్రసాద్ లైన్స్ ఇంటర్నేషనల్ విద్యా సంక్షేమ చైర్మన్‌లు మాట్లాడుతూ హర్షవల్లి లయన్స్ క్లబ్ ద్వారా అనేక కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. యువత సక్రమ మార్గంలో పయనించి తమ తల్లిదండ్రులకు, సమాజానికి అండగా నిలిచి వారి జీవితాలను మెరుగుపరుచుకోవాలని, ఈ దిశలో ప్రభుత్వం అందిస్తున్న ఉద్యోగ ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని, అందుకోసమే ఈ సదస్సును తాము నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న సెట్ శ్రీ సూపరిండెంట్ రేఖ మాట్లాడుతూ యువతకు అనేక అభివృద్ధి ప్రోత్సహక కార్యక్రమాలను సెట్‌శ్రీ ద్వారా నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు నిరుద్యోగ యువత అతి పెద్దసంఖ్యలో హాజరైన ఈ సదస్సులో లయన్ డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, ఎంజె ఎఫ్, లయన్ మణిశర్మ కార్యదర్శి, తర్లాడ అప్పలనాయుడు ఉపాధ్యక్షుడు పార్వతీశ్వరరావు, డైరెక్టర్ స్వచ్ఛంద సేవకురాలు మీసాల మాధవి, చైతన్య జూనియర్ కళాశాల డైరెక్టర్ రైతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ‘ఫిట్’ సర్టిఫికేట్ సెంటర్ ఏర్పాటు చేయాలి

(సత్యంన్యూస్, పలాస)



పలాసలో ఆటో ‘ఫిట్’ సర్టిఫికేట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని పలాస నియోజకవర్గ నాయకులు దువ్వాడ శ్రీధర్ (బాబా) కోరారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పలాస నియోజకవర్గంలో సుమారు 5వేల ఆటోలతో వ్యక్తిగతంగా పలువురు జీవనోపాధి పొందుతున్నారన్నారు. ఆటోడ్రైవర్లు ప్రతి ఏడాది ఆటోఫిట్ సర్టిఫికేట్ పొందాలనే నిబంధన ఉందన్నారు. ఇది వరకు పలాసలోనే మంజూరు చేసేవారన్నారు. ప్రస్తుతం సర్టిఫికేట్స్ పొందాలంటే శ్రీకాకుళం ఆర్టీవో కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోందన్నారు. దీంతో పలాసకు చెందిన ఆటోడ్రైవర్లు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇన్నివేల ఆటోలు హైవేపై ప్రయాణించాలంటే ఎన్నో ప్రమాదాలకు కారణమవుతాయన్నారు. వీటిని గమనించి పలాసలో ఫిట్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆ ప్రకటనలో కోరారు.

## జనసైనిక కుటుంబాలకు ఆర్థికసాయం

### - తోటి సైనికులకు అండగా నిలుస్తాం

### - వజ్రపుకొత్తూరు జనసైనికులు

(సత్యంన్యూస్, వజ్రపుకొత్తూరు)

ఆపదలో ఉండే తోటి సైనికులకు అండగా నిలుస్తామని, వజ్రపుకొత్తూరు జనసైనికులు గురువారం తెలిపారు. వజ్రపుకొత్తూరు జనసైనికులు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా, వజ్రపుకొత్తూరు మండలంలో ఇటీవలే జనసైనికులు వరుస ప్రమాదాలు, ఆరోగ్య సమస్యల కారణంతో చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోయారని, వారి మరణం కుటుంబానికి, జనసేనకు తీరని లోటని, నువ్వలరేవుకి చెందిన ఇద్దరు జనసైనికులు బెహరా. ధర్మ, బెహరా సన్నా బైక్ ప్రమాదంలో చనిపోగా, గడూరుకి చెందిన పొట్టి కృష్ణ జనసైనికుడు అనారోగ్యం పాలయ్యారనే సమాచారాన్ని తోటి జనసైనికులు తెలిపారన్నారు. ఇందులో భాగంగా వజ్రపుకొత్తూరు మండల జనసేన నాయకులు వారి మూడు కుటుంబాలకి ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయంతోపాటు నిత్యావసర సరుకులను అందించి అండగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఆర్థికసాయాన్ని అందించిన జనసైనికులకు కృతజ్ఞులు తెలియజేసారు. కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు, జన సైనికులు టి. తేజ, కే.ఈశ్వర్, శంకర్, గణపతి, పద్మా, మిన్నా, ఉమామహేష్, వంశీ, పూర్ణా, లోకనాథం స్థానికులు పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు సిక్కోలు క్రీడాకారులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు సిక్కోలు క్రీడాకారులు పాల్గొనబోతున్నారని ప్రతీ క్రీడాకారుడు పతకంతో రావాలని చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ బాడాన దేవభూషణ్ అన్నారు. రానున్న భవిష్యత్ తరానికి స్ఫూర్తిగా నిలిచి, బాడీబిల్డింగ్‌కు పూర్వవైభవం తేవాలని, ఇప్పుడిప్పుడే సిక్కోలు బాడీబిల్డర్స్ అదే తపనతో అడుగులు వేస్తుండటం హర్షణీయమన్నారు. ఈనెల4న భీమవరంలో జరగనున్న బాడీ బిల్డింగ్ పోటీలకు జిల్లా నుండి పలువురు బాడీ బిల్డర్స్‌ను స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో ఈరోజు ఎంపిక చేశారని జిల్లా అధ్యక్షులు తారకేశ్వరరావు, కార్యదర్శి కె.గౌరీశంకర్ తెలిపారన్నారు. వారందరూ విజేతలుగా నిలిచి జిల్లా కీర్తిని ఇనుమడింపజేసి రాష్ట్రస్థాయిలో ఒకవెలుగు వెలగాలన్నారు. సీనియర్ బాడీబిల్డర్ బి.విజయకుమార్ అందిస్తున్న సహకారం విన్నానని, అందుకు జిల్లావాసిగా గర్వపడుతున్ననన్నానని, 55 కేజీల విభాగంలో బి.అభి, వైకుంఠం, 60 కేజీల విభాగంలో విభాగంలో ఎస్.బన్నీ, సుమంత్‌లు, 65 కేజీల విభాగంలో ఎం. రాంబాబు ఎంపికైన వారిలోఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బాడీ బిల్డర్ సందీప్, చరణ్ తదితరులు పాల్గొన్నారు



## ప్రైవేట్ ఉపాధ్యాయునికి నిత్యావసర సరుకులు పంపిణీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆపదసేవే మాధవసేవని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు పేర్కొన్నారు. స్థానిక పీఎన్‌కాలనీ వినాయక ఆలయ ప్రాంగణంలో ప్రైవేట్ ఉపాధ్యాయులు కరకవలస సంతోష్‌సాగర్‌కు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ స్థానిక ఠాగూర్ పబ్లిక్ పాఠశాలలో మ్యాథ్స్ టీచర్‌గా సేవలందిస్తూ కొన్నినెలల క్రిందట జరిగిన రహదారి ప్రమాదంలో గాయపడి ఇంటికే పరిమితమయ్యారన్నారు. వీరి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఆముదాలవలసకు చెందిన చందు, రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్‌కు తెలియజేయడంతో ఆయన పెట్టిన వాట్సాప్ స్టేటస్‌కు స్పందించి నగరానికి చెందిన సుసరాపు శ్రీలత, దాసరి రవికుమార్, స్టేట్ బ్యాంకు అసోసియేట్ నల్ల గౌతమి అందించిన సహకారంతో సుమారు మూడు నెలలకు సరిపోయే సరుకులు, 26 కేజీల బియ్యంతోపాటు సేకరించిన కొంత నగదుని సైతం అందించి ఆదుకోవటం హర్షణీయమన్నారు. ఆపదలో ఉండేవారిని ఆదుకోవటమే, నిజమైన మానవత్వమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్, సేవకులు ఉర్లం శివతేజ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు సమాన అవకాశాలు ఇవ్వాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బీసీలకు ఇచ్చినట్లు ఎస్సీలకు కూడా కార్పొరేషన్ రుణాలలోసమాన అవకాశాలు ఇవ్వాలని అడ్వకేట్ వై.చలపతిరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇచ్చేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఆ మేరకు మార్గదర్శకాలు విడుదల ఏప్రిల్ 11నుండి మే 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరగనుందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ సహాయంతో దళిత, బలహీనవర్గాల ప్రజలకు జనరిక్ మెడికల్ షాప్‌లు, ల్యాబ్, ఎలక్ట్రికల్ బ్యాటరీ ఛార్జింగ్ యూనిట్, ఎలక్ట్రికల్ ఆటో, కార్లు, గూడ్స్‌ట్రాక్ యూనిట్ ద్వారా ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించే కార్పొరేషన్ రుణాలు నోటిఫికేషన్ జారీ చెయ్యడం పట్ల శ్రీకాకుళం జిల్లా దళిత అడ్వకేట్‌ల బృందం హర్షం వ్యక్తం చేసిందన్నారు. అయితే ప్రభుత్వ ఉత్తర్వులు చూస్తే దళితులు, బలహీన వర్గాల లబ్ధిదారులకు వ్యత్యాసం కనిపిస్తుందని, బీసీలు జనరిక్ మెడికల్ షాప్ పెట్టుకుంటే రూ.8 లక్షలు ప్రభుత్వం ఇస్తే రూ.4లక్షల సబ్సిడీ, రూ.4లక్షలు బెనిఫిసిరి కట్టుకోవాల్సి ఉందన్నారు. కానీ ఎస్సీలకు ప్రభుత్వం రూ.5 లక్షలు ఇస్తే 2లక్షలు సబ్సిడీ రూ.3లక్షలు కట్టుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ వ్యత్యాసం కనిపిస్తుందని, ఖర్చు అందరికి ఒకేలా ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దళితుల పట్ల వివక్ష చూపుతుందని బావన కనిపిస్తుందని విమర్శించారు. వీటిని తేడా లేకుండా సరిచేసి, దీనిపై పరిశీలన చేసి బీసీలకు ఇచ్చిన విధంగా ఎస్సీలకు కూడా సమాన అవకాశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేటికీ దళితులు ఆర్థికం, సామాజిక, రాజకీయంగా వెనుకబడుతూ వివక్షత, అంటరానితనం ఎదుర్కొంటూనే ఉన్నారన్నారు. ఈ సెక్షన్‌లో సెంటు భూమి లేని వారు అత్యధికులు ఉన్నారన్నారు. ఇపుడిపుడే చదువుకున్న యువత ముందుకు వస్తున్న వారికి ఉపాధి అవకాశాలలో ముందుకు తోడ్పాటు కల్పించవలసిన ప్రభుత్వాలు రుణాలు ఇచ్చే చేయూతనివ్వడం మంచి పరిణామమన్నారు. రుణాలలో సమాన అవకాశాలు కోసం పునరాలోచన చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# పోలీసుల అదుపులో ఇద్దరు అంతర్ జిల్లా దొంగలు



❖ 17 కేసుల్లో రూ.45.53 లక్షలు విలువైన ఆభరణాలు స్వాధీనం

❖ వివరాలు వెల్లడించిన ఎస్పీ మహేశ్వరరెడ్డి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విశాఖ, విజయగనరం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాల పరిధిలో 17 కేసుల్లో నిందితులుగా ఉన్న ఇద్దరు అంతర్ జిల్లాల దొంగలను కాశీబుగ్గ పోలీ స్లు అదుపులోకి తీసుకున్నారని ఎస్పీ కె.మహే శ్వరరెడ్డి తెలిపారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావే శంలో నిందితులతో పాటు వారు చోరీచేసిన సొత్తును మీడియా ముందుంచారు. ఈ సందర్భం గా ఎస్పీ మాట్లాడుతూ పలాస-కాశీబుగ్గ పురపా లక సంఘం పరిధిలో నర్సిపురం రైల్వేగేట్ ఫ్లై ఓవర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నింది తులు పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం జోగంపేటకు చెందిన పోల భాస్కర రావు, ఎచ్చెర్ల మండలం ముద్దాడపేటకు చెందిన ముద్దాడ నరసింగరావులు ద్విచక్ర వాహనంపై వస్తూ పట్టుబడ్డారని తెలిపారు. వారిని స్థానిక పోలీసులు విచారించగా శ్రీకాకుళం జిల్లాలో 16 దొంగతనాలు, మన్యం జిల్లా పాలకొండలో ఒక దొంగతనం చేసినట్టు తెలిపారన్నారు. వీటితో పాటు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో దొంగతనాలు చేసినట్లు గుర్తించామన్నా రు. వారి వద్ద నుంచి సుమారు సుమారు రూ. 40.02 లక్షల విలువ గల 435.52 గ్రాములు (37 తులాల) బంగారు ఆభరణాలు, రూ.2 లక్షలు విలువ గల ఒక డైమండ్ బ్రాస్లెట్, లాకెట్, రూ.26 వేలు విలువ గల 233.2 గ్రాములు (20 తులాలు) వెండి వస్తువులు, రు.25వేలు నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, ఒక స్కార్పియోను సీజ్ చేసినట్టు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మొత్తం సొత్తు విలువ 45.53 లక్షలని తెలిపారు. దొంగి లించిన ఆభరణాలను ఒడిశాకు చెందిన ముత్యాలు, విశాఖపట్నంకు చెందిన బోణి గోవిందరాజులుకు, మన్యం జిల్లాకు చెందిన గ్రంధి శ్రీనివాసరావు, ఎచ్చెర్లకు చెందిన పోలం కృష్ణకు ఇచ్చినట్టు విచా రణలో గుర్తించామన్నారు. దొంగిలించిన కొంత మొత్తంతో ఒక స్కార్పియో కొనుగోలు చేశారని తెలిపారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న రెండు ద్విచక్ర వాహనాలను నిందితుడు ముద్దాడ నర సింగరావు చోరీ చేసినట్టు తెలిపారు. నిందితులి ద్దరూ ముందుగా ఒక గ్రామాన్ని ఎంచుకొని సాయంత్రం సదరు గ్రామానికి వెళ్లి ఫోన్లను స్విచ్ ఆఫ్ చేసి తాళాలు వేసి ఉన్న ఇళ్లను రెక్కీ నిర్వ హించి వారి వెంట తెచ్చుకున్న వస్తువులతో తలుప తాళం విరగ్గొట్టి, బీరువాలు తెరిచి బంగారం, వెండి వస్తువులు అపహరించారని తెలిపారు. ఇద్దరు నిందితులు నేరప్రవృత్తి కలిగినవారేనని తెలిపారు. వివిధ కేసుల్లో ఇద్దరూ వేర్వేరుగా జైల్లో కొన్నాళ్లు పాటు ఉన్నారని వివరించారు. ఇద్దరూ జైల్లో పరిచయమై రాత్రివేళల్లో దొంగతనాలు చేయటం మొదలుపెట్టారు. నిందితుడు పోలా భాస్కరరావుపై శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో సుమారు 37 చోరీ కేసులు నమోదయినట్టు తెలి పారు. 8 కేసుల్లో శిక్ష పడినట్టు వివరించారు. ముద్దాడ నరసింగరావుపై శ్రీకాకుళం, విజయనగ రం, విశాఖపట్నం జిల్లాల్లో సుమారు 17 చోరీ కేసులు, ఒక సారాయి కేసు నమోదయ్యాయని, మూడు కేసుల్లో శిక్ష పడిందన్నారు. కాశీబుగ్గ సబ్ డివిజన్ డీఎస్పీ వివి వెంకటప్పారావు ఆధ్వర్యంలో చాకచక్యంగా వ్యవహరించి కేసు ఛేదించటంలో ప్రతిభ కనబర్చడంపై ఎస్పీ అభినందించారు.

సీసీఎస్ ఎస్ఐ సూర్యచంద్రమౌళి, కాశీబుగ్గ ఎస్ఐ సూర్యనారాయణ, సీసీఎస్ ఎస్ఐ కె.మధు సూదనరావు, పోలీసు సిబ్బంది శ్యాంసుందరరావ్, కె.భాస్కరరావు, విజయ్ కుమార్, హరీష్, ఉషా కిరణ్‌లను ఎస్పీ కొనియాడి ప్రత్యేకంగా అభినం దించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య లేకుండా చూస్తాం

(సత్యంన్యూస్, పలాస)

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో తాగునీటి సమస్య లేకుండా చూస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కాశీబుగ్గ న్యూకాలనీలో మున్సిపల్ సాధారణ నిధులు రూ. 20 లక్షలు వ్యయంతో సరఫరా చేయనున్న నీటి ట్యాంకులకు గురువారం ఆమె పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలాస-కాశీ బుగ్గ మున్సిపాలిటీలో తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడిపోతున్నా వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక మొదటి ప్రాధాన్యతగా తాగునీటి పైనే దృష్టి పెట్టామ న్నారు. ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు నుంచి పలాస కాశీబుగ్గ పట్ట ణాలకు వేసవిలో తాగునీరు అందిస్తామని చెప్పారు. ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు నుంచి నీరు వచ్చే వరకు మున్సిపల్ వీధులకు రోజుకు 24 ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఏపీ ట్రేడ్ ప్రమో షన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, వార్డు ఇన్‌ఛార్జి కొత్త సత్యం, చెల్లూరు రామకృష్ణ, ఎం.నరేంద్ర, దువ్వాడ శ్రీకాంత్, బి. నాగరాజు, సప్ప నవీన్, మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు, మున్సి పల్ డీఈ కనకరాజు, ఏఈ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# అమ్మ'దొంగ' పోలీసులూ..!

(మొదటిపేజీ తరువాయి)

ఈ మొత్తాన్ని సంపాదించానని తాగిన మైకంలో గ్రామంలో కొందరికి చెప్పినట్టు భోగట్టా. బుడ్డీ గత చరిత్ర కూడా కొంత అను మానాస్పదంగా ఉండటం వల్ల ఆయన నుంచి సొమ్ములు తీసుకున్నా మంటే తమను కూడా లోపలేస్తారనే భయంతో ఎవరూ నోరు విప్ప డంలేదు. అయితే ఈ డబ్బులు పంపిణీ చేసిన కృష్ణను స్టేషన్‌కు రావాలని వారి వెంట తీసుకువెళ్లిపోయారని, కృష్ణ డబ్బులు దుబారా గా ఖర్చుచేసి గ్రామంలో పంపిణీ చేస్తున్నట్టు స్థానికుల ద్వారా తెలుసుకున్న ఆయన కూతురు, అల్లుడు రాజమండ్రి నుంచి వచ్చా రని, వీరిద్దరిని పోలీసులు తీసుకువెళ్లిపోయారని గ్రామస్తులు చెబుతు న్నారు. బుడ్డీ పంచిన సొమ్ము, బుడ్డీ వద్ద మిగిలిన సొమ్ము అన్నీ కూడా దఫదఫాలుగా వీరిద్దరూ పట్టుకుపోవడంపై ఇప్పుడు డిపార్ట్ మెంట్‌లో గందరగోళం జరుగుతోంది.

## ఏసీబీకి చిక్కిన

# డీఎంహెచ్‌వో

### - రూ.20వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు -



సత్యంన్యూస్, శ్రీకాకుళం

ఒక ఉద్యోగికి రీపోస్టింగ్ ఇవ్వడానికి రూ.20 డిమాండ్ చేసి ఆ మొత్తాన్ని సీసీ ద్వారా తీసుకుంటుండగా డీఎంహెచ్‌వోను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు కళ్లేపల్లి పీహెచ్‌సీలో సీనియర్ సహాయకురాలిగా పనిచేసిన దివ్యాంగురాలు ఎ.కాంతమ్మ 2024 అక్టోబర్ 2న మెడికల్ లీవ్‌పై వెళ్లి, ఆ తర్వాత సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరై రీపోస్టింగ్ కోసం ఆర్‌జేడీని సంప్రదించింది. ఆర్‌జేడీ కార్యాలయం రీపోస్టింగ్ ఇవ్వాలని డీఎంహెచ్‌వోకు ఫిబ్రవరిలోనే ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాలు అమలుచేయాలని డీఎం హెచ్‌వో కార్యాలయం చుట్టూ తిరిగినా స్పందించలేదు. రీపోస్టింగ్ కోసం వాన సురేష్ డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణతో మాట్లాడి రూ.20వేలు డిమాండ్ చేశాడు. దీంతో ఏసీబీ అధికారులను సంప్రదించింది. అందులో భాగంగా గురువారం డీఎంహెచ్‌వో బాలమురళీ కృష్ణ చాంబర్‌లో సీసీ వాన సురేష్‌కు రూ.20 వేలు నగదు ఇచ్చింది. ఏసీబీ అధికారులు ఇచ్చిన రూ.500 నోట్లును కాంతమ్మ సీసీ వాన సురేష్‌కు ఇవ్వడం, ఆయన వద్ద డీఎంహెచ్‌వో బాలమురళీ కృష్ణ తీసుకొని జేబులో పెట్టుకున్నాడు. ఆ సమయంలో ఏసీబీ అధికారులు ప్రవేశించి డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ జేబుల్లో నుంచి పౌడర్ పూసిన నోట్లు స్వాధీనం చేసుకొని డీఎంహెచ్‌వోనూ, సీసీ సురేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. రికార్డులు పరిశీలించిన అనంతరం విచారించి కేసు నమోదుచేసి విశాఖపట్నం తరలించడానికి సిద్ధమయ్యారు. ఇటీవల పాలకొండలోనూ సీసీ ద్వారా డబ్బులు డిమాండ్ చేసి తీసుకుంటుండగా కమిషనర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అదే మాదిరిగా జిల్లా కేంద్రంలో డీఎంహెచ్‌వో సీసీ ద్వారా డబ్బులు వసూలుచేయించి అడ్డంగా బుక్కయ్యారు. డీఎంహెచ్‌వోగా అర్హత లేకపోయినా అధికార పార్టీ నాయకుల సిఫార్సుతో జనవరి 4న విధుల్లో చేరిన బాలమురళీకృష్ణ లంచావతరం ఎత్తి మూడు నెలల్లోనే ఏసీబీకి పట్టుపబడ్డారు. సీసీగా నెల రోజుల క్రితం రాజకీయ సిఫార్సుతో విధుల్లో చేరిన వాన సురేష్ ఇటీవల ప్రతి ఫైల్‌కు డబ్బులు వసూలుచేస్తూ డీఎంహెచ్‌వోతో కలిసి వాటాలు పంచుకున్నారని ఆరోపణలు ఉన్నాయి.


## శ్రీకాకుళం జిల్లా ప్రజలకు శుభవార్త

ప్రముఖ ప్రసూతి మరియు స్త్రీవైద్య నిపుణులు

తేది: 5-4-2025 శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచితంగా చూడబడును.

డా॥ బొడ్డేపల్లి మీనాక్షి M.B.B.S., DGO

ప్రసూతి మరియు స్త్రీ వైద్యనిపుణులు

హిమోగ్లోబిన్, షుగర్ టెస్టులు ఉచితంగా చేయబడును.

అవసరమైనచో థైరాయిడ్ టెస్ట్ 50% రాయితీతో చేయబడును.

ఉచితంగా ఓపీ చూడబడును. ఈ అవకాశం ఈ ఒక్కరోజు మాత్రమే.

తేది: 5-4-2025 శనివారం

ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు

-: ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకోవలెను :-

శ్రీ వైష్ణవి గణేష్ డాక్టర్స్ ప్లాజా

డే & నైట్ జంక్షన్, పెట్రోల్ బంకు ఎదురుగా,

సత్య లాడ్జి ప్రక్కన, శ్రీకాకుళం, సెల్: 99854 69073, 98661 68604, 70755 18604


# సచివాలయంలో వృద్ధురాలు ఆందోళన



(సత్యంన్యూస్, టెక్కలి)

సంతబొమ్మాళి మండలం వడ్డితాండ్ర సచివాలయంలో పింఛన్ నిలిపి వేయడాన్ని నిరసిస్తూ కోటపాడుకు చెందిన వృద్ధురాలు లింగూడు ఏకాశి ఆందోళన చేపట్టింది. కోటపాడు పంచాయతీ వడ్డితాండ్ర సచివాలయం లో రెండు నెలలుగా వృద్ధాప్య పింఛన్ ఇవ్వకుండా రాజకీయ కారణాలు చూపించి నిలుపుదల చేయడంపై సర్పంచ్‌తో కలిసి బాధితురాలు సచి వాలయం సిబ్బందిని గురువారం నిలదీసింది. ఈ సందర్భంగా కోట పాడు సర్పంచ్ మాట్లాడుతూ ఐదేళ్లగా అందిస్తున్న వృద్ధాప్య పింఛన్‌ను రాజకీయ నాయకుల జోక్యం కారణంగా రెండు నెలలుగా నిలిపేశారని ఆరోపించారు. ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసినా విచారణ పేరుతో అధికారులు నిలిపేశారని ఆరోపించారు. గతంలో బాధితురాలు ఏకాశి పింఛన్‌పై విచారణ చేసి అర్హురాలుగా గుర్తించారని, ఇప్పుడు విచారణ పేరుతో పింఛన్ నిలుపుదల చేయడంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై గ్రామ కార్యదర్శి స్పందిస్తూ లింగూడు ఏకాశిపై గ్రామస్థుల నుంచి ఫిర్యాదు వచ్చిందని, దానిపై ఎంపీడీవో విచారణకు ఆదేశించా రని తెలిపారు. విచారణ నివేదిక డీఆర్‌డీఏకు పంపించి ఎంపీడీవో నిర్ణ యం తీసుకోవాల్సి ఉందని తెలిపారు.

# బాల్య వివాహాలపై అవగాహన



(సత్యంన్యూస్, కొత్తూరు)

ప్రస్తుతం జరుగుతున్న బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై కొత్తూరు మండలం ఇరపాడు ప్రాథమిక పాఠశాలలో బుధవారం, ఫాదర్స్ హౌస్ స్వచ్ఛంద సంస్థ అవగాహన సదస్సు నిర్వహించింది. ఫాదర్స్ హౌస్ డైరెక్టర్ మరీ ప్రెస్సిల్ల మాట్లా డుతూ పిల్లలు చాలా జాగ్రత్తగా ఉండాలని, కొత్తవారిని త్వరగా నమ్మకూడదని తెలిపారు. బాల్యవివాహాలు, వాటి వల్ల కలిగే అనర్థా లను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు రాజారావు, పాఠశాల సిబ్బంది, సంస్థ ప్రతినిధులు సతీష్, సునీత తదితరులు పార్గొన్నారు.

## ఎస్సీలకూ కార్పొరేషన్ రుణాల్లో

# సమాన అవకాశాలు ఇవ్వాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇచ్చేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఆ మేరకు మార్గ దర్శకాలు విడుదల ఏప్రిల్ 11నుంచి మే 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ రిజి స్ట్రేషన్ ప్రక్రియ జరగనుంది. రాష్ట్రంలో ప్రభుత్వ సహాయంతో దళిత, బలహీన వర్గాల ప్రజలకు జనరిక్ మెడికల్‌షాప్‌లు, ల్యాబ్, ఎలక్ట్రికల్ బ్యాటరీ ఛార్జింగ్ యూనిట్, ఎలక్ట్రికల్ ఆటో, కార్లు, గూడ్స్ ట్రాక్ యూనిట్ ద్వారా ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించే కార్పొరేషన్ రుణాలు నోటిఫికేషన్ జారీ చెయ్యడం పట్ల శ్రీకాకుళం జిల్లా దళిత అడ్వ కేట్‌ల బృందం ప్రతినిధి వై.చలపతిరావు హర్షం తెలిపారు. అయితే ప్రభుత్వ ఉత్తర్వులు మాత్రం దళితులు, బలహీన వర్గాల లబ్ధిదారు లకు వ్యత్యాసం కనిపిస్తుందని అన్నారు. బీసీలు జనరిక్ మెడికల్ షాప్ పెట్టుకుంటే రూ.8 లక్షలు ప్రభుత్వం ఇస్తే రూ.4 లక్షల సబ్సిడీ, రూ.4 లక్షలు బెనిఫిసిరి కట్టుకోవాలని, అయితే ఎస్సీలకు ప్రభుత్వం రూ.5 లక్షలు ఇస్తే, రూ.2 లక్షలు సబ్సిడీ, రూ.3 లక్షలు కట్టుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం దళితుల పట్ల వివక్ష చూపుతుందనే బావన కనిపిస్తుందన్నారు. రుణాల్లో సమాన అవకాశాల కోసం పున రాలోచన చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని చలపతిరావు కోరారు.

## వీఆర్‌ఎల్ కంటైనర్లతో

# వైర్లు తెంపేస్తున్నారు!






బండి తగులుకొని రోడ్డుపై వైరు తెగిపోయినా పట్టించుకోకుండా వెళ్లిపోతున్న వీఆర్‌ఎల్ ట్రాన్స్‌పోర్ట్ వాహనం

- చిన్నసందుల్లోకి భారీ వాహనాలు
- ఊరి శివారులో ఉండాల్సిన ట్రాన్స్‌పోర్టులు వీధుల్లో
- గతంలోనూ తెగిపోయిన కరెంట్ పోల్ మెయిన్ వైర్లు
- ఇప్పటికి పైప్‌లైన్ 10 సార్లు పాడైంది
- కార్పొరేషన్ సిబ్బంది చెప్పినా పట్టించుకోని వైనం
- ప్రశ్నించేవారిని మేనేజ్ చేస్తున్న వైనం

**ఊరికి శివారులో ఉండాల్సిన ట్రాన్స్‌పోర్టులు వీధుల్లో ఉంటున్నాయి. ఈ కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అసలే చిన్న చిన్న సందులు, ఆపై విద్యుత్ వైర్లు, ఇంకా జియో తదితర ఫైబర్ నెట్‌వర్క్ వైర్లు కిందకు వేలాడుతుంటాయి. వాటిని కనీసం పట్టించుకోకుండా ఈ వాహనాలు తెంపేస్తున్నాయి. అంతేకాకుండా ఇప్పటికి పదిసార్లు ఇక్కడ మెయిన్ పైప్‌లైన్ ఉండే రోడ్డు మీదుగా అతి బరువుతో ఈ వాహనాలు వెళ్లడం వల్ల తుమ్మావీధిలో పైప్‌లైన్ తరచూ పాడవుతోంది. వీటిపై ప్రశ్నించే వారిని మేనేజ్ చేసేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..**



మెయిన్‌పైప్‌లైన్ లీకై రోడ్డుపై నీరు నిలిచిన దృశ్యం



వీఆర్‌ఎల్ కారణంగా ఇప్పటికి ఐదుసార్లు పైప్‌లైన్ పాడైన ప్రాంతం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో ఇరుకు సందులున్న వీధి అనగానే గుర్తొచ్చేది తుమ్మావీధి. అయితే కత్తెరవీధిలో ఎంతోకాలంగా నడుప కొస్తున్న వీఆర్‌ఎల్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాల పుణ్యమాని ఇక్కడి ప్రజలకు నిత్యం నరకం ఎదురవుతోంది. భారీసైజు ట్రాన్స్‌పోర్ట్ వాహనాల కారణంగా ఇక్కడ భూమికి మూడడుగుల కింద ఏర్పాటుచేసిన మెయిన్ పైప్‌లైన్ ఎప్పటికప్పుడు దెబ్బతింటోంది. ఈ విషయమై గతంలో కార్పొరేషన్ సిబ్బందికి తెలుపగా, వారు ట్రాన్స్‌పోర్ట్ వారిని హెచ్చరించి ఊరుకున్నారు. ఇప్పటికి చాలాసార్లు ఇలా జరిగింది. నాలుగు రోజుల క్రితమే పీఎస్‌ఎన్‌ఎం స్కూల్ వెనుక వైపు పైప్‌లైన్ దెబ్బతినడంతో బాగుచేశారు. ఆ మరుసటిరోజే వీధిలో మరో చోట పైప్‌లైన్ బద్దలై ఇలా నీరు రోడ్డుపై పారుతోంది. దీనిపై గతంలో తుమ్మావీధి వాసులు ట్రాన్స్‌పోర్ట్ సిబ్బందిని ప్రశ్నిస్తే.. మరో రెండు నెలల్లో ఇక్కడి నుంచి మార్చేస్తామని సర్దిచెప్పి పంపేశారు. ఉడుకురక్తం కుర్రాళ్లు వెళ్లి అడిగితే వారిని మేనేజ్ చేసేస్తున్నారు. ఈ ట్రాన్స్‌పోర్ట్ వాహనాల పుణ్యమాని కరెంటు, ఫైబర్ వైర్లు తెగిపోతున్నాయి. ఇటీవల ఒక భారీ కంటైనర్ వీధిలోకి రావడంతో విద్యుత్ వైర్లు దానికి తగిలి ఒక రోజంతా వీధిలో కరెంట్ లేకుండాపోయింది. అంతేకుండా వైర్లు తెగిపోవడంతో స్థాని కులు అక్కడ కాపలా ఉండి కరెంటువారు వచ్చి లైన్లు బాగుచేసేవరకు అందర్నీ వేరే రూటులో పంపించారు. కనీసం వైర్లు కంటైనర్ ఈడ్చుకు పోతోందని స్థానికులు కేకలు వేస్తున్నా పట్టించుకోకుండా డ్రైవర్లు బండిని పోనిచ్చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, కార్పొరేషన్ సిబ్బంది పట్టించుకోవాలని, ఈ ట్రాన్స్‌పోర్ట్‌ను ఊరి శివారుకు పంపే ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు. కాగా పైప్‌లైన్ పాడైన విషయాన్ని స్థానిక టీడీపీ నాయకుడు మౌళి సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లగా, బాగుచేయిస్తామని వారు తెలిపారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.